ప్రజాశక్తి
ఆదివారం 17 ఆగస్టు 2025 5
శ్రీ సత్యసాయి



తొలి రోజు గందరగోళం..!

◆ నామమాత్రంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణం
◆ ఏ బస్సులో ఫ్రీ అన్నదానిపై స్పష్టత కరువు



నార్పలలో ఆర్టీసీ బస్ ఎక్కుతున్న మహిళలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

స్త్రీశక్తి ఉచిత బస్సు అమల్లో మొదటి రోజ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొంత అయోమయం, గందరగోళం నెలకొంది. ఏ బస్సుకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందో దేనికి వర్తించదో తెలియక మహిళలు ఇబ్బందులు పడ్డారు. అనంతపురం రీజయన్ పరిధిలో అత్యధికంగా ఇంటర్ స్టేట్ రూట్లు ఉన్నాయి. జల్లాకు సరిహద్దున కర్నాటక ఉండటంతో అటువైపు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లోని వారు కర్నాటకపైనే ఎక్కువ ఆధారపడి ప్రయాణిస్తుంటారు. ఈ బస్సులకు స్త్రీశక్తి పథకం వర్తించదు. దీంతో ఛార్జీలు పెట్టుకునే వెళ్లాల్సి వస్తోంది. అనంతపురం రీజయన్ పరిధిలో మొత్తం 184 రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతుండగా 35 ఇంటర్ స్టేట్ రూట్లు ఉన్నాయి. ఇందులో 26 రూట్లు కర్నాటకలోకి వెళ్తాయి. బెంగళూరు, పావగడ, బళ్లారి, చెళికేర ఉన్నాయి. ఈ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదు. టిక్కెట్టు తీసుకునే సమయంలో ఒరిజనల్ ఆధార్ కార్డు అడుగుతుండటంతో అది లేని వారు టిక్కెట్టు తీసుకోవాల్సి వస్తోంది.

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం డిపో పరిధిలో 73 బస్సులు ఉన్నాయి. ఇందులో ఉచిత ప్రయాణం సౌకర్యం ఉన్న బస్సులు 49, ఉచిత బస్సు ప్రయాణం లేని బస్సులు 24. అంతరాష్ట్ర సర్వీసులులలో ఉచిత ప్రయాణ సౌకర్యం లేదు. కళ్యాణదుర్గం నుంచి పరశురాంపురం, హేమావతి, నాగేపల్లి గేటుకు వెళ్లే ఐదు బస్సుల్లో రెండు బస్సులకు ఉచిత ప్రయాణం లేదు. ఉచిత ప్రయాణం బస్సులో టికెట్ జారీ చేసి టిమ్‌లో ఉమెన్ ఫ్రీ టికెట్, డబ్బులు తీసుకునే టికెట్ వివరాలు పక్కపక్కనే ఉండడం కండెక్టర్లను ఇబ్బందికి గురి చేస్తోంది.

ప్రయాణికులు లేక నార్పల స్టాండ్‌లో నిలిచిన ఆటోలు



ఆటోలు స్టాండ్‌కే పరిమితం

నార్పల : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో ఆటోలకు గిరాకీ తగ్గింది. నార్పల మండల కేంద్రం నుంచి ప్రతి గ్రామానికి ఆటోల ద్వారా ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించేవారు. ఉచిత బస్సులు రావడంతో ప్రయాణికులు బస్సుల్లో వెళ్లేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఆటోలన్నీ స్టాండ్లకే పరిమితం అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ కుటుంబాల పోషణ ఇబ్బందిగా మారుతుందన్నారు. ఆటోలకు కనీసం కంతులు కూడా కట్టలేమన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. ప్యాసింజర్ ఆటోలు తీసేసి, లగేజ్ ఆటోలుగా మార్చుకోవాల్సి ఉంటుందన్నారు.

ధర్మవరంలో ఉలికిపాటు

◆ ఉగ్ర అనుమానంతో వ్యక్తి అరెస్టు
◆ అదుపులోకి తీసుకున్న ఎన్ఐఎ



ఎన్ఐఎ అదుపులోకి తీసుకున్న అనుమానితుడు నూర్ మొహమ్మద్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉగ్ర కలకలం రేగింది. ధర్మవరంలో ఉన్న ఓ వ్యక్తికి పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధం ఉందని ఆరోపణలతో ఎన్ఐఎ, ఐబి అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరం పట్టణం లోనికోటకు చెందిన నూర్ మొహమ్మద్ ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. ఇటీవల ఇతను పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతో ఫోన్‌లో వాట్సాప్ ద్వారా చాటింగ్ చేసినట్లు సమాచారంతో ఎన్ఐఎ అధికారులు యువకునిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఎన్ఐఎ, ఐబి అధికారులు నూర్ మొహమ్మద్ ఇంట్లో తనిఖీలు నిర్వహించి 16 రకాల సిమ్ కార్డులు లభ్యమైనట్లు సమాచారం. కాగా ఇతన్ని మంగళవారం నాడే అదుపులోకి తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

విచారణ జరుగుతోంది : డీఎస్పీ

ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న నేపథ్యంలో నూర్ మొహమ్మద్‌ను ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్నారని, అతనిపై విచారణ కొనసాగుతోందని ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. నూర్‌మొహమ్మద్ సెల్‌ఫోన్ ద్వారా ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా మాట్లాడుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు ఎన్ఐఎ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకుకున్నారన్నారు. ఈ విషయంపై విచారణ జరుగుతోందన్నారు.

నాలుగు రోజులుగా మా అన్న కనిపించలేదు..

మా అన్న చాలా మంచివాడని, అతనికి ఉగ్రసంస్థలతో ఎలాంటి సంబంధాలూ లేవని నూర్ మొహమ్మద్ చెల్లెలు తెలిపారు. హోటల్‌లో పని చేస్తున్న తన అన్నని మంగళవారం నాడు కొందరు వారితో పాటు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతని ఫోన్ కూడా పని చేయలేదన్నారు. శనివారం ఉదయం 3 గంటలకు చాలా మంది పోలీసులు తమ ఇంటి వద్దకు వచ్చారన్నారు. మా అన్న కళ్లకు గంతలు కట్టి ఇళ్లంతా సోదాలు చేశారన్నారు. సోదాల అనంతరం మళ్లీ అతన్ని వారి వెంట తీసుకెళ్లారని తెలియజేశారు.

కొలిక్కి వస్తున్న బ్యాంకు దోపిడీ కేసు

ప్రధాన నిందితుడు అరెస్ట్
త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం : డీఎస్పీ

ప్రజాశక్తి - హిందూపురం

తీవ్ర సంచలనం రేకెత్తించిన హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్‌పోస్ట్ ఎస్‌బిఐలో జరిగిన చోరీ కేసు కొలిక్కి వస్తోంది. చోరీ జరిగిన వెంటనే పోలీసు ఉన్నతాధికారులు సంఘటనను తీవ్రంగా పరిగణించి ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. బ్యాంకులో లభ్యమైన ఆధారాల మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. అనంతపురం డిఐజి, పుట్టపర్తి జిల్లా ఎస్పీల పర్యవేక్షణలో తనతో పాటు సబ్ డివిజన్‌లోని సిఐలు, ప్రత్యేక దర్యాప్తు బృందాలుగా గత 20 రోజులుగా కేసు విచారణలో భాగంగా పలు రాష్ట్రాల్లో పర్యటించినట్లు డీఎస్పీ వికె.మహేష్ తెలిపారు. పలువురు పాత నేరస్తులను విచారించి, నేరస్థలంలో లభించిన సాంకేతిక ఆధారాలతో నిందితులు హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్, అతని సహచరులు నేరం చేసినట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. కేసులో ప్రధాన నిందితుడు అనిల్ కుమార్ పన్వార్‌ను హర్యానా రాష్ట్రంలో అదుపులోకి తీసుకుని తీసుకుని న్యాయ పరంగా వెంటనే శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. అయితే ఈ కేసులో ఇంకా విచారణ కొనసాగుతోందని, కేసులో చోరీ కాబడిన సొత్తు వివరాలు తెలియాల్సి ఉందన్నారు. న్యాయ సూత్రాలను ఖచ్చితంగా పాటించాల్సిన బాధ్యత తమపై ఉండడంతో నిందితున్ని వెంటనే కోర్టులో హాజరు పరచాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అతి త్వరలోనే వెల్లడిస్తామని డీఎస్పీ వివరించారు.

పారిశుధ్యం చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



పట్టణంలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని నివాసాల మధ్య వర్షం నీరు నిలవడంతో ప్రజలు రోగాల పాలవుతున్నారని, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో అధికారులు తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం, సిఐటియు నాయకులు శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎక్కడికక్కడ వర్షం నిలిచి రోడ్లు, ఖాళీ స్థలాలు మడుగులను తలపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా వారపు సంత, వివేకానందనగర్, కర్నాటక నాగేపల్లి వంతెన, బస్టాండ్ రహదారులు, సమీపంలోని నివాసాల మధ్య నీరు నిలిచిందన్నారు. దీంతో దోమలు ఉత్పత్తి కావడం వల్ల ప్రజలు విష జ్వరాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే అపార్ట్మెంట్లలోని బోరు బావుల్లోకి ఈ నీరు ఇంకి కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇంకా పట్టణంలో పలుచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం పేరుకుపోయిందన్నారు. కావున మున్సిపాలిటీ అధికారులు వెంటనే పారిశుధ్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, ముత్యాలు, తిరుపాలు, సిద్దు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ టిఎస్.చేతన్



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సర్దార్ గౌతుల లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా జమీందారీ వ్యతిరేక పోరాటంతో పాటు హరిజన సేవ, మద్యపాన నిషేధం కోసం పోరాటాలు సాగించారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా తదితర పోరాటాల్లో అనేకసార్లు జైలు జీవితం గడిపారన్నారు. సమాజం కోసం తన జీవితమంతా ధారపోశాడని తెలిపారు. గిరిజన రైతు కూలీల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్రానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఆయన జీవితమంతా నిరాడంబరంగా గడిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఒ సూర్యనారాయణ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, డిపిఆర్‌ఒ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రామాంజిని సత్కరిస్తున్న చిరుద్యోగులు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం రోడ్లు, భవనాల శాఖలో గత 33 సంవత్సరాల నుంచి గ్యాంగ్ మజ్దూర్‌గా పనిచేస్తున్న రామాంజికి స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రాష్ట్ర అవార్డు వచ్చింది. ఈ నేపథ్యంలో ఉద్యోగ పోటీ పరీక్షల్లో సాధన చేసి ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు హిందూపురానికి విచ్చేసిన రామంజిని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో శనివారం సత్కరించారు. తనవంతుగా నిరుద్యోలకు సహకారం అందించానని, దానిని గుర్తించుకుని తనను సన్మానించడం సంతోషాన్ని ఇస్తోందని రామంజి తెలియజేశారు.


నేడు శ్రీసత్యసాయి యూనిటీ కప్ ఫైనల్స్

పుట్టపర్తి క్రైమ్ : భారతదేశంలో ఉన్న శ్రీసత్యసాయి సేవా సంస్థల మధ్య ఏడాది పొడవునా జరిగిన క్రికెట్ మ్యాచ్ ఆఖరి అంకానికి చేరుకుంది. సత్యసాయి ట్రస్టు వర్గాలు తెలిపిన వివరాలు.. హర్యానా, అస్సాం, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, చత్తీస్‌ఘడ్, గోవా రాష్ట్రాల జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయన్నారు. ఈ నెల 17వ తేదీ శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో క్రికెట్ అభిమానులు మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విశేష అతిథులుగా భారత మాజీ క్రికెటర్లు సునీల్‌జోషి, అమూల్ మజుంధార్, మురళీ కార్తీక్, ఎంఎస్‌కె ప్రసాద్, శ్రీలంక మాజీ క్రికెట్ కెప్టెన్ అర్జున రణతుంగ, వెస్టిండీస్ మాజీ క్రికెటర్ కలిచరణ్ హాజరుకానున్నారని తెలిపారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం నియోజకవర్గ పంచాయితీ రాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎన్నికలను నిర్వహించారు. నియోజకవర్గ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా హెచ్.రియాజ్, ఉపాధ్యక్షులుగా గోవిందరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎమ్ఎస్. అమృత రావు, సంయుక్త కార్యదర్శిగా కుళ్లాయప్ప, కోశాధికారిగా విద్యావతి, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.బాబు, వైవి.నాగఫణిలు ఎన్నికయ్యారు.




నూతన కార్యవర్గం సభ్యులు

పిన్నదరిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని పిన్నదరి గ్రామాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హిందుస్థాన్ కోకా కోలా యాజమాన్యం సహకారంతో గ్రామంలో మినరల్ వాటర్ ఆరో ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనిని శనివారం మంత్రి సత్యకుమార్ సతీమణి త్రివేణి, కుమారుడు రిషి అద్వానీయాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. త్రివేణి మాట్లాడుతూ గ్రామస్తులు ఈ మినరల్ వాటర్‌ను ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాడిమర్రి నుంచి పిన్నదరి గ్రామానికి రోడ్డు వసతి సరిగా లేదని గుంతలమయమైందని మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంకా నాగార్జున తెలపడంతో స్పందించిన ఆమె ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొంగటి రమేష్, దేవర రాము, టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, ఆరవేటి సదాశివ, ఆరవేటి ఆనంద్, ఏటుకూరి నాయుడు, బ్యాళ్ల పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి త్రవేణి

పుస్తకావిష్కరణకు సహకరిస్తా

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ


ప్రజాశక్తి - హిందూపురం



బాలకృష్ణకు పుస్తకాన్ని అందిస్తున్న ఉమర్‌ఫారూఖ్ ఖాన్

హైదరాబాద్‌లో భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకం ఆవిష్కరణకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హామీ ఇచ్చారు. శనివారం మాజీ మున్సిపల్ ఛైర్మన్ జెవి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ హిందూపురం నందమూరి బాలకృష్ణ స్వగృహంలోని కార్యాలయంలో కలిశారు. కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్స్ (భారత దేశ నిర్మాణంలో ముస్లిం దేశభక్తులు పాత్ర) గ్రంథాన్ని హిందూపురం శాసన సభ్యులు, సినీనటుడు నందమూరి బాలకృష్ణకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమం లో అసువులు భాసిన ముస్లిం దేశ భక్తులు దేశ నిర్మాణంలో ముస్లింల సాంస్కతిక, చారిత్రాత్మక పాత్ర తదితర విషయాలను పుస్తకంలో పొందుపరిచామన్నారు. హైదరాబాద్‌లో పుస్తకావిష్కరణకు ఎమ్మెల్యే సహకారం అందిస్తామని చెప్పారన్నారు.

వేగ జ్యువెల్లర్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



'అనంత'లో వేగ జ్యువెల్లర్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

వేగ జ్యువెల్లర్స్ నాణ్యత, మన్నికకు బ్రాండ్ అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొ న్నారు. అనంతపురం నగరంలోని రాజు రోడ్డులో ఏర్పాటు చేసిన వేగ జ్యువెల్లర్స్ షాపును శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగ దారులకు సరసమైన ధరల్లో నాణ్యమైన, మన్నికైన అన్ని డిజైన్స్‌తో తయారుచేసిన ఆభరణాలను అందించే వాటిలో వేగ జ్యువెల్లర్స్ ప్రముఖంగా నిలుస్తుందన్నారు. అలాంటి పేరు ప్రఖ్యాతలు గాంచిన వేగ జ్యువెల్లర్స్ షాపు అనంతపురంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ బ్రాంచిలో వినియోగదారులకు నాణ్యమైన, మన్నికైన మంచి మంచి డిజైన్స్‌తో కూడిన ఆభరణాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులను కోరారు. ఆభరణాలు మహిళలకు ఎంతో అలంకారంగా ఉంటాయ న్నారు. ఆభర ణాలు కొనుగోలు చేసే విషయంలో వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేగ జ్యువెల్లరీ షాపు మేనేజర్ బాల దుర్గాప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది, నగర ప్రముఖులు, పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచికి అభినందనలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో శుక్రవారం మండలంలోని గొట్లూరు గ్రామ సర్పంచి పిట్టా నరసమ్మ కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర షెకావత్ నుంచి స్వచ్ఛ పురస్కారం అందుకున్నారు. గొట్లూరును మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దినందుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి నరసమ్మ ఈ పురస్కారం అందజేసింది. గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర వేడుకలకు ఆహ్వానం పలికి ఈ పురస్కారం అందజేసింది. దీంతో ఎంపిడిఒ సాయి మనోహర్, సచివాలయ ఉద్యోగులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, అధికారులు, ప్రజలు సర్పంచి నరసమ్మను అభినందించారు.



అభినందనలు అందుకున్న సర్పంచి నరసమ్మ

అనుమతి ఉన్న ప్రదేశాల్లోనే ఇసుక సేకరించాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే ఇసుక తీసుకెళ్లాలని ఆర్డీవో మహేష్ ఆదేశించారు. మండలంలోని రామాపురం, చిన్నచిగులరేవు, తదితర పరిసరాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ప్రాంతాలను శనివారం ఆయన తహశీల్దార్ స్వర్ణలత తో కలిసి తనిఖీ చేశారు. అలాగే రామాపురం గ్రామం వద్ద చిత్రావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లోని అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇసుక తరలింపులో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే ఇసుక సేకరించాలన్నారు. లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను తరలించే సమయంలో ఇసుకపై టార్పాలిన్ పరచాలని ఆదేశించారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్, పోలీస్ అధికారులను ఆదేశించారు.

పాఠశాలకు ఐడిబిఐ ఉపకరణాలు వితరణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని రావులచెరువు జడ్పీ హైస్కూల్‌కు శనివారం పట్టణంలోని ఐడిబిఐ బ్యాంకు ప్రతినిధులు రూ. 1.75 లక్షల విలువచేసే ఉపకరణాలు అందజేశారు. బ్యాంకు అధికారులు బాలమురుగన్, శ్యామ్ సుందరం, నాగభూషణం, శ్రీనివాసులు మాట్లాడుతూ 18 బెంచ్‌లు, క్లాస్ టేబుల్స్–5, చైర్లు–5, ఆఫీస్ టేబుల్, కంప్యూటర్ టేబుల్, ప్రింటర్, పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదవాలని, ఓ లక్ష్యం నిర్దేశించుకుని జీవితంలో ముందుకెళ్లాలని సూచించారు. హెచ్ఎం, విద్యార్థులు బ్యాంకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించాలని ఎమ్మెల్యేకు వేడుకోలు


ఎమ్మెల్యే కందికుంటకు వినతి ఇస్తున్న మహిళ

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక గీతా మందిరంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అక్కడికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని నిర్వాహకులను అభినందించారు. వేడుకల నిర్వాహకులు భక్తులకు కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. రిటైర్డ్ పంచాయతీ సెక్రటరీ బూసుపల్లి నరసింహారెడ్డి ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించారు. 15 ఏళ్లుగా పింఛను వచ్చేదని ఇటీవల తొలగించారని న్యాయం చేయాలని విజ్ఞాపనలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మిద్దె కూలిపోయిందని ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని సుభాన్ అనే వ్యక్తి మొరపెట్టుకోగా ఎమ్మెల్యే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, నాయకులు శివారెడ్డి, లక్ష్మీనారాయణ, అశ్వర్థ నాయుడు, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, అంజనప్ప, రామానుజులు, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో శనివారం బెంగళూరుకు చెందిన మంజునాథ నేత్రాలయ సహకారంతో ప్రభాకర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పల్లె ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి కళ్లు ఎంతో ప్రధానమైనవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం బిజీగా గడుపుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో వైద్యులు అనిల్‌కుమార్, సికిందర్, వైద్య బృందం సుమారు 127 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 37 మందికి చికిత్స అవసరమని గుర్తించి బెంగళూరులోని మంజునాథ నేత్రాలయ ఆసుపత్రికి పంపిన తెలిపారు. కార్యక్రమంలో మంజు నాథ నేత్రాలయ వైద్యులు, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికాకు చెందిన అంగీలా డిక్సన్, లలిత అనూఫ్, రేఖ, మండల కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు మురళీధర్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, బొమ్మయ్య, శ్రీరామ్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల స్నేహ పూర్వక క్రికెట్ పోటీలు పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన శనివారం నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో ఒడిసి జట్టుపై తనకల్లు జట్టు విజయం సాధించింది. నరేష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రుద్రంరెడ్డి, సురేష్, ఆజమ్ అందజేశారు. రెండో పోటీలో ఎన్‌పి.కుంట-2 జట్టుపై తలుపుల జట్టు విజయం సాధించగా పవన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును శ్రీనివా సులు, గంగాధర్‌రెడ్డి అందజేశారు. మూడో మ్యాచ్ లో గోరంట్ల జట్టుపై ఎన్‌పి.కుంట-1 జట్టు గెలుపొందగా ఆనంద్ నాయక్‌కు గోపాల్, రుద్రంరెడ్డి, రామ్మోహన్, ముబారక్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో యుటి ఎఫ్ జిల్లా కార్యదర్శి తాహెర్‌వలి, ఎస్‌టియు రామ్మోహన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కుంచెపు శ్రీనివాసులు, ఆజం, అశ్వర్థ, మనోహర్, శంకర్, నారాయణరెడ్డి, రమణ, మను, మహేంద్ర, యోగి పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తాం


మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న సురేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భవిష్యత్తులో వినియోగదారుల సంఘాలు మరింత బాధ్యతగా పని చేసి వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు మెరుగైన సేవలందిం చినందుకు ప్రతిభా పురస్కారాలు దక్కినట్లు ఆయన తెలిపారు. పుట్టపర్తిలో శుక్రవారం జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి సవిత, కలెక్టర్ టిఎస్.చేతన్ నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వినియోగదారుల సంఘాలను నిర్వీర్యం చేయగా, కూటమి ప్రభుత్వం వినియోగదారుల సంఘాలను గుర్తించి ప్రతిభా పురస్కార్ అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. తద్వారా వినియోగదారుల సంఘాలు, వినియోగదారులు, వినియోగదారుల వ్యవహారాల అధికారులకు సత్సంబంధాలు ఏర్పడతాయని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ పేర్కొన్నారు. ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఈ సంఘానికి గుర్తింపు వచ్చి నేటితో ఆరేళ్లు అయిందన్నారు. నాల్గో తరగతి ఉద్యోగి నుంచి గ్రూప్-1 అధికారుల వరకూ అన్ని కేడర్ల ఉద్యోగులు ఈ సంఘంలో కొనసాగుతున్నారన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఎదురైనా సంఘం దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు గోవిందప్ప, నాయకులు రవి, ముసలిరెడ్డి, సహాయ కార్యదర్శి కిషోర్, జిల్లాలోని వివిధ తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


సంఘం జెండాను ఆవిష్కరించిన నాయకులు

సామర్థ్యం తగ్గిన విద్యుత్ ఇన్సులేటర్లు..!

తరచూ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని మహమ్మదాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అతి ముఖ్యమైన ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. వాటి సామర్థ్యం తగ్గిపోవడంతో చినుకులు పడితే చాలు నిప్పురవ్వలు రాజు కుంటున్నాయి. ఈ సమయాల్లో ఆ ప్రాంతాల్లో పిడుగులు పడినా, గాలులు వీచినా, వర్షం కురిసినా ఇన్సులేటర్లు దెబ్బతినే అవకాశం ఉంది. అలాంటి వాటిని గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తీగలు తాకే చెట్లను కత్తిరించి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనికి తోడు సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో విద్యుత్ సమస్య తలెత్తుతుంది. చిన్నపాటి గాలివీచినా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. చెట్లకు విద్యుత్ తీగలు తాకే చోట సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో వీధిలైట్లు, ఇళ్లలో బల్బులు వెలగక ప్రజలు అంధకారంలో గడపాల్సి వస్తుంది. కుటాగుళ్ల 132/33 కెవి సబ్ స్టేషన్ పరిధిలో మహమ్మాదాబాద్ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా లైన్ లాగారు. పాత లైన్ కావడంతో లైన్ వెంబడి ఇన్సులేటర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.


బలహీన పడిన విద్యుత్ ఇన్సులేటర్

వర్షాకాలం కావడంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎక్కడికక్కడ చెట్లు తెగిపోవడం ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోవడం, ఫీడర్లు ట్రిప్ అవడం, ఉరుములు, మెరుపులు పిడుగుల శబ్దాలకు ఇన్సులేటర్లు దెబ్బ తినడం వంటి సమస్యలతో విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు గంటల కొద్దీ చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి వస్తోంది.

సమస్య లేకుండా చూస్తాం : ఎడి ఓబులేష్

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తాం. ఎటువంటి కోతలు లేకుండా చూస్తాం. ఈదురు గాలులు వీచిన సమయంలో స్తంభాలు నేలకొరిగినా, ఉరుములు, మెరుపులు, పిడుగులు పడిన సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు ఎక్కడైనా దెబ్బతింటే పునరుద్ధరణ చర్యలు చేపడ తాం. విద్యుత్తు లైన్లన్నీ పరిశీలించి సరి చేయిస్తాం. కుటాగుళ్ల సబ్ స్టేషన్ నుంచి మహమ్మదాబాద్ సబ్‌స్టేషన్ వరకూ పాత ఇన్సులేటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు రాగానే మారుస్తాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం స్ఫూర్తిదాయకం

జయంతి సభలో గౌడ సంఘం నాయకులు


సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఈడిగ(గౌడ) సంఘం, టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యాదవ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య, మాజీ జడ్పీటీసీలు చిన్నప్పయ్య, నారాయణస్వామి, గిరిధర్‌గౌడ్, హిందూపురం ఈడిగ సంఘం నాయకులు రామకృష్ణ హాజరయ్యారు. ముందుగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం, హరిజన సేవ, మద్యపాన నిషేధం, జమీందారీ వ్యతిరేక పోరాటం, తదితర ఉద్యమాల్లో లచ్చన్న సేవలు చిరస్మరణీయమన్నారు. పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై జీవితాంతం శ్రమించారని గుర్తుచేశారు. ఆయన చూపిన ఆత్మీయత, త్యాగం, పోరాటస్ఫూర్తిని యువత తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీఓ తీసుకొచ్చేందుకు కృషి చేసిన మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, ఈశ్వరప్రసాద్, సిద్దయ్య, రమణమ్మ, నరేంద్ర, గోపి, నారాయణస్వామి, ప్రకాష్‌గౌడ్, మారుతి, హరి, హిందూపురం ఈడిగ సంఘం నాయకులు దేవేంద్రప్ప, గిరిశేఖర్, ఈడిగ సామాజిక వర్గం ప్రజలు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నల్లమాడ

మండలంలో రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. మండల అధ్యక్షులుగా పి.మాధవరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.గణేష్, సభ్యులుగా పి.దేవేంద్ర, పి.మల్లికార్జున, వి.వెంకటేశులు, రాముడు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రైతులు వేరుశనగకు ప్రత్యామ్నాయంగా పంటలు సాగు చేయడానికి సద్దలు, రాగులు, జొన్నలు, పెసలు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడి రైతులకు లీటర్ పాలపై అదనంగా రూ. 20 చెల్లించాలన్నారు. దాణాపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, గేదెలు, ఆవులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయాలని, షెడ్లు నిర్మించాలన్నారు. మృతిచెందిన పశువుకు ఇస్తున్న నష్టపరిహారం పెంచాలి, ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోవిందు, మల్లికార్జున, రాజు, రైతులు పాల్గొన్నారు.


సమావేశమైన రైతు సంఘం నాయకులు


ప్రశాంతి నిలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం ప్రశాంతి నిలయం, గోకులం, కోవెలగుట్టపల్లి ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోకులంలోని సత్యసాయి గోశాలలో ఉన్న ఆవులను అలంకరించి అక్కడి నుంచి ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్ వరకూ తీసుకెళ్లారు. అక్కడ గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పండ్లు తినిపించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఏటా గోశాల నుంచి ఆవులను ముస్తాబు చేసి ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి సందర్భంగా సాయి కుల్వంత్ హాలులోని బాబా సమాధి వద్ద సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువత రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయా గ్రామాల్లో ఉట్టి కొట్టు కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సాహసంతో ఉట్టుకొట్టిన యువతకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.


గోవులకు పండ్లు తినిపిస్తున్న రత్నాకర్

ఉప్పర కార్పొరేషన్ చైర్మన్‌కు ఆత్మీయ సన్మానం


వెంకటరమణను సన్మానిస్తున్న టిడిపి మండల నాయకులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

రాష్ట్ర సగర(ఉప్పర) సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణను రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి.ఆంజనేయులును ఆధ్వర్యంలో శనివారం పలువురు టిడిపి మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వారిలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ తుమ్మల మహబూబ్‌బాషా, నాయకులు గంట శ్రీనివాసులు, డీలర్ కొత్త సుధాకర్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, కుమార్ రాయల్, సుధాకర్ పాల్గొన్నారు.


ఇటీవల కురిసిన వర్షాలకు వడ్డిపల్లిలో పాచిపట్టిన సీసీ రోడ్డు

పాచిపట్టిన రోడ్డు.. జాగ్రత్త సుమా..!

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వడ్డిపల్లి గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారి అయిన సీసీ రోడ్డుపై నీరు నిలిచి పాచిపట్టింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి తోడు దుర్వాసన వెదజల్లడం, దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇక పలు వీధుల్లో చెత్త పేరుకుపోయినా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, చెత్తకుప్పలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆనందంగా ఉండాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యమని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరి, ఎపి సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి మద్దతుగా శనివారం టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎర్రగుంటలో ఉన్న పార్టీ కార్యాలయం నుంచి గాంధీనగర్ సర్కిల్ వరకూ వందలాది ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకూ తొలి విడతగా రూ. 7వేలు బ్యాంకు ఖాతాలో జమ చేసిందన్నారు. వైసిపి హయాంలో జగన్ రూ. 15వేలు ఇస్తానని చెప్పి కొందరికే ఇచ్చారన్నారు. నేడు పార్టీలకు అతీతంగా అర్హులైన రైతులందరికీ రూ. 20వేలు ఇస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను 90 శాతం అమలు చేశామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, జక్కంపూటి సత్యనారాయణ, ప్రభాకర్ నాయుడు, రమేష్ బాబు, తుమ్మల మనోహర్, చల్లా శ్రీనివాసులు, సురేంద్ర, గంటాపురం జగ్గు, తాడిమర్రి కన్వీనర్ కూచి రాము, హర్ష, గొట్లూరు శ్రీనివాసులు, విజయ్‌సారథి, మేకల రామాంజనేయులు, రమణ, విజయ్‌చౌదరి, జంగం నరసింహులు, ఆజాద్, రాఘవరెడ్డి, ఆదెప్ప, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీషిర్డీసాయి హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని శ్రీషిర్డీసాయి హైస్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా పాఠశాల కరెస్పాండెంట్ పసుపులేటి సురేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ పసుపులేటి సూర్యతేజ కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారులకు శ్రీకృష్ణుడు, బాలరాముడు, రాధా, రుక్మిణి, సత్యభామ, గోపికల వేషధారణలో అలంకరించి తీసుకొచ్చారు. వివిధ భక్తి గేయాలకు చిన్నారులు నృత్యాలు చేశారు. చివరగా నిర్వహించిన ఉట్టి కొట్టు కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : వైసిపి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని వైసిపి మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, కొడపగానిపల్లి సర్పంచి అలివేలమ్మ, నరసింహారెడ్డి, మాజీ సర్పంచి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కొడపగానిపల్లి గ్రామంలో శనివారం వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కూటమి ప్రభుత్వం, వైసిపి చంద్రబాబు మోసాలపై వైసిపి రూపొందించిన క్యూర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సిఎం చంద్రబాబు 600కు పైగా వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని మండిపడ్డారు. రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి వరలక్ష్మి, వాల్మీకి శంకర్, నాయకులు మహబూబ్‌బాషా, చెవిరెడ్డి, సురేందర్, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్, ఎల్లప్ప, రామాంజనేయులు, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులపై పోలీసుల ఉక్కుపాదం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలతో పాటు మద్యం తాగే వారిని డ్రోన్ సాయంతో గుర్తించి, ఆ ప్రాంతంలోకి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచి అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా శనివారం కదిటౌన్ మహిళా పిఎస్ ఎస్ఐ సుమతి, పోలీస్ సిబ్బందితో కలిసి కదిరి సమీప ప్రాంతాల్లో డ్రోన్ సహకారంతో ప్రత్యేక నిఘా ఉంచి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించారన్నారు. మద్యం బాబులు అక్కడి నుంచి పరుగులు తీయగా వెంబడించి 11 మందిని పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రైల్వే పోలీసులు ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. కదిరి రైల్వే స్టేషన్, మార్కెట్ యార్డ్ సమీపంలో సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన పురుషుడి మృత దేహం లభించిందన్నారు. అతడు అనుమానాస్పద రీతిలో మృతి చెందినట్లు తెలిపారు. చామన ఛాయ, బ్రౌన్ కలర్ బనియన్, పాచి కలర్ డ్రాయరు ధరించి ఉన్నాడని తెలిపారు. ఇతడి గురించి సమాచారం తెలిస్తే రైల్వే ఎస్ఐ సి.బాలకృష్ణ 89190 90782, మహబూబ్ బాషా 9133109537 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సుజాత(28) శుక్రవారం రాత్రి వెంకటాపురం సమీపంలోని ఓ క్వారీ గుంతలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు శనివారం నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీసి వెంకటాపురం గ్రామానికి చెందిన సుజాతగా గుర్తించారు. భర్త నంజుడప్ప తాగుడుకు బానిసై నిత్యం వేధింపులకు పాల్పడుతుండటంతో సుజాత మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డెత్ స్పాట్‌గా మారిన క్వారీ గుంత

ఈ క్వారీ గుంత డెత్ స్పాట్‌గా మారిందని చెప్పవచ్చు. ఈ గుంతలో దుస్తులు ఉతకడానికి వెళ్లి, ఈత కొట్టడానికి దిగి, ఆత్మహత్యలకు ప్రయత్నించి ఇప్పటివరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఓ యువకుడు ఈ గుంతలో ఈతకెళ్లి మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మరింత ప్రాణ నష్టం జరగకముందే ఈ ప్రమాదకర గుంతను మూసివేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోయి నేడూ అదేతీరున వాన..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వాతావరణ మార్పుల ప్రభావం వర్షాలు రాకలో స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో గతేడాది లాగా ఈ ఏడాది వర్షాలు తీరుండటం గమనార్హం. ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంటూ ఉంది. ఆగస్టులో అధిక వర్షపాతం నమోదయింది. గడిచిన రెండు సంవత్సరాల తీరు ఇదే రకంగా వర్షపాతం నెలకొంది. పోయిన సంవత్సరం కూడా జన్‌లో మంచి వర్షాలు పడినప్పటికీ జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ ఏడాది మేలో మంచి వర్షపాతం పడింది. జూన్, జులై నెలలో తీవ్ర వర్షాభావం కొనసాగింది. ఆగస్టులో అధిక వర్షపాతం నమోదైంది. 2024 -25 సంవత్సరంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.7 అయితే 147.7 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 142 శాతం అధికంగా పడింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు అయితే 24.4 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణంలో 61 శాతం లోటు పడింది. ఆగస్టు నెలలో సాధారణం 83 మిల్లీమీటర్లు అయితే 210 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 151 శాతం అధికంగా వర్షపాతం పడింది. ఈ ఏడాది చూస్తే జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.7 మిల్లీమీటర్లకుగానూ 47.9 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 21.7 శాతం లోటు పడింది. జులై నెలలో 64.3 మిల్లీమీటర్లకుగానూ 34.7 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 46 శాతం లోటు పడింది. ఆగస్టు ఇప్పటి వరకు 39 మిల్లీమీటర్లు పడాల్సి ఉంటే 140.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 282 అధికంగా వర్షపాతం పడింది. సీజన్ మొత్తం సాధారణ వర్షపాతం పడినట్టు కనిపించినా నెలల వారీగా చూసినప్పుడు పెద్ద వ్యత్యాసముంది. ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన చేసే సమయంలో సీజన్‌ను పరిగణలోకి తీసుకుని ప్రకటిస్తోంది. దీంతో వర్షాభావంతో నష్టపోతున్న రైతులకు పరిహారం సక్రమంగా అందటం లేదు గతేడాది ఇదే రకంగా జరిగింది. కరువు మండలాల ప్రకటన సరిగా లేదని అధికార పార్టీ నేతలే పలు సమావేశాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల్లోనున్న లోపం కారణంగానే ఈ నష్టం జరుగుతోందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలో స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీని అమలు శనివారం నుంచే ఆరంభమైంది. అయితే ఆచరణలో కొన్ని ఇక్కట్లు ఉన్నాయి. ఏ రూటులో, ఏ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం అమలు జరుగుతుందో తెలియక అయోమయం పడుతున్నారు. ప్రధానంగా అనంతపురం జిల్లాకు



సరిహద్దున కర్నాటక ఉండటంతో ఇంటర్ స్టేట్ సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రయాణించేటటప్పుడు సమస్య వస్తోంది. ఇక రాజకీయంగా చూసినప్పుడు సిపిఎం సత్యసాయ జిల్లా మహా సభలు జరిగాయి. సిపిఐకు సంబంధించి అనంతపురం జిల్లా మహాసభలు ఈ వారంలో జరిగాయి. అనంతపురం అర్బన్ టిడిపిలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, మాజ ఎమ్మెల్యే వై.ప్రభాకర్ చౌదరి మధ్య మాటల యుద్ధం రచ్చకెక్కింది. పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డి వివాహానికి హాజరయ్యేందుకు అనంతపురం విచ్చేశారు.

ఒడిశా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్‌గా రఘువీరారెడ్డి


మడకశిర రూరల్ : సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ఒడిశా రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్‌గా నియమించింది. ఒరిస్సాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయ డంలో భాగంగా రఘువీరాను నియమించినట్లు తెలిసింది.

వైబి.హళ్లికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

మడకశిర రూరల్ : మండలంలోని వైబి.హళ్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. వైబి.హళ్లి గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉండగా రద్దు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా తమకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆ గ్రామంతో పాటు ఈ మార్గంలోని ఏడు గ్రామాల మహిళలు పేర్కొంటున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైబి.హళ్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

దొడగట్ట ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

రొద్దం : మండలంలోని దొడగట్ట గ్రామ ఎంపిపి పాఠశాలకు రొద్దం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మంజునాథ్ రూ. 20 వేల విలువ చేసే మైక్ సెట్, రూ. 5వేల విలువ చేసే మ్యాజిక్ పలకలు అంద జేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వీటిని మంజునాథ్ దంపతులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అందజేశారన్నారు. ఉదార స్వభావం కలిగిన మంజునాథ్ దంపతులను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, విద్యార్థులు, జ్ఞాపిక, శాలువా, పూలమాలలతో సత్కరించారు.


పాఠశాలకు మైక్ సెట్ అందజేస్తున్న మంజునాథ్ దంపతులు